


పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి


కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఎఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సెప్టెంబర్ 8 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా ప్రజలు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య ఐఎఎస్ తెలియజేశారు.

పెడదోవన యువత

- నగరంలో పెరుగుతున్న నేరాలు
- రాజకీయ నాయకుల అండదండలు
- ఆధ్యాత్మిక నగరానికి అపవాదు

> భావిభారత పౌరులు యువత క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరుగా నిలిచి, విలువలతో కూడిన జీవితాన్ని సాగిస్తూ, లక్ష్య చేధనకు అనునిత్యం కృషి చేస్తూ, తాను ఎదుగుతూ దేశాభివృద్ధికి దోహదపడాల్సిన ముఖ్యులు. కానీ బూర్జువ రాజకీయ నాయకులు స్వప్రయోజనాల కోసం పావులుగా మారి, జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా, సమాజంలో చీడపురుగుల్లా తయారవుతుడడం శోచనీయం. నేటి యువత తప్పుడు మార్గంలో పయనిస్తూ, పెడదోవన పడుతోంది. వారికి బూర్జువ రాజకీయ నాయకులు అండదండలు అందిస్తుండడం గమనార్హం.
>
> - ప్రజాశక్తి-తిరుపతి సిటీ

భారతదేశానికి ప్రపంచ దేశాల్లో ఓ ప్రముఖ స్థానం ఉంది. సంస్కృతి, సంప్రదాయాలు, విలువలతో కూడిన జీవితానికి ఇది దిక్సూచి. తెలుగురాను ఉట్టిపడే ఆంధ్రప్రదేశ్ మరో అడుగు ముందు ఉంది. అందున ఆధ్యాత్మికతకు కేంద్రంగా ఉంటూ, ప్రపంచ దేశాలకు సుపరిచితమైన తిరుపతి జిల్లా స్థానం మరింత ప్రత్యేకత కూడుకున్నది. అంతటి ప్రాముఖ్యతగల జిల్లా ఆధ్యాత్మికతకు నెలవైన తిరుపతి నగరంలో ఇటీవల ఘర్షణలు, దాడులు అధికమయ్యాయి. అందునా నడిరోడ్లపై కత్తులతో దాడి చేసే సంస్కృతి హెచ్చరిల్లుతుంది. తరుచు చోటు చేసుకుంటున్న ఘటనలే అందుకు నిదర్శనం. సాధారణంగా ప్రతి మనిషి, మరీ ముఖ్యంగా యువత సంతోషజీవనాన్ని సాగించేందుకు, ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు, తమ పేరు కింద డిగ్రీలు ఉండేలా చేసుకునేందుకు తపనపడుతూ, ఉన్నత విద్యలో రాణిస్తుంటారు. కానీ ఇటీవల కాలంలో తాము ఫలానా వారి తాలుకా అని వాహనాలపై స్టిక్కర్లు అంటించుకుని మరీతిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వింత పోకడ పెరిగిపోయింది. చేతిలో డబ్బు, వెనకాల పవర్ ఉంటే చాలు అనేలా వ్యవహరిస్తున్నారు. దీన్ని ఆసరగా తీసుకుని రాజకీయ నాయకులు భుజాలు తడుతూ ప్రోత్సహిస్తున్నారు. తమ అధికారాన్ని పదిలం చేసుకునేందుకు ఇలాంటి అవసరం రం అనేలా వ్యవహరిస్తూ, యువత పెడదోవన పడడా నికి ప్రత్యక్షంగా సహకరిస్తుండడం శోచనీయం. ఈ ధోరణి కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత కాసింత ఎక్కువయింది. ఆ పార్టీ.. ఈ పార్టీ అనేమి లేదు. బూర్జువ పార్టీలన్ని ఆదిశగానే నడుస్తున్నాయి. వామపక్షా లు తప్ప తక్కిన పార్టీల్లో నీతి, నియమాలు కలిగిన సిద్ధాంతాలు కాగడ పట్టి వెతికినా అగుపించడం లేదు. అన్ని పార్టీల్లో యువత తదే రాజ్యం, తల్లి, దండ్రి ప్రజాప్రతినిధి అయినా కుమారులు, కుమార్తెలదే పెత్తనం. అలాంటి వారి అధికార రాజకీయాల అండ తో యువత రౌడీయి జం చేస్తూ మత్తుకు బానిసవు తున్నారు. ఇటీవల కాలంలో నగరంలో దాడులు, దౌర్జన్యాలు అధికమయ్యాయి. మొన్నటికి మొన్న తిరుపతి కొర్లగుంట కేంద్రంగా పాతకక్షలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, తన స్నేహితులతో కలిసి, ఓ ఆటో డ్రైవర్ పై అర్థరాత్రి కత్తితో దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడడం, దాడికి గురైన వ్యక్తి తిరగబడి, అదే కత్తితో వారిపైకి దాడి చేయడంతో, ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన విదితమే. ఇటీవల కాలంలో జిల్లా పోలీసులు నిర్వహిస్తున్న డ్రోన్ నిఘా ద్వారా మత్తు ఇంజక్షన్లు, గంజాయిని సేవించేవారు అధికంగా బయటపడు తున్నారు. వీటికి అధికార, ప్రతిపక్ష పార్టీల సపోర్టు



ఉందన్న విషయం జగమెరిగిన సత్యం. అది ఎంతగా అంటే యువత ఎక్కువగా తమ ద్విచక్ర వాహనాలపై, కార్లపై తాను ఎంఎల్ఏ తాలూకా, ఎంపి తాలూకా, పవన్ కళ్యాణ్ తాలూకా, అంటూ పెయింటింగ్ వేయించుకుని తిరుగుతూ, పోలీసు లను సైతం బెదిరిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, యువతను పెడదారిపడకుండా, బూర్జువ రాజకీయాలకు బలవ్వకుండా కాపాడాలని పలువురు తల్లిదండ్రులు, ప్రజాస్వామ్య వాదులు కోరుతున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మెరుగైన సేవలు అందిద్దాం

- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : 24వ తేదీ నుండి జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సేవలు అందిద్దామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో ఎలాంటి చిన్న సంఘటన కూడా బ్రహ్మోత్సవాలలో జరగలేదు. ఈ సంవత్సరం కూడా అన్ని డిపార్ట్మెంట్ అధికారులతో సమన్వయ సహకారంతో ఉద్యోగం చేసి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే... అధికారులు అందరు సమన్వయంతో కలిసి నిర్ణయం తీసుకుంటే ఎలాంటి సమస్యకైన పరిష్కారం దొరుకుతుందన్నారు. బాలాజీ నగర్, పాప వినాశనం ప్రాంతాలలో నాకాబందీ నిర్వహించాలని ఆదేశించారు. ఆటో డ్రైవర్లు, జీప్ డ్రైవర్లకు భక్తులతో ఏ విధంగా మెలగాలననే దాని పైన అవగాహన సదస్సు ఏర్పాటు చేయవలసిందిగా తిరుమల డిఎస్పీకి, సంబంధిత అధికారులకు తెలియజేశారు. తిరుమలలో పబ్లిక్ అవేర్నెస్ మీటింగ్ నిర్వహించాలని ప్రజలను ఎడ్యుకేట్ చేసే విధంగా చేయలన్నారు. 400 మంది సిబ్బందితో క్రౌడ్ కంట్రోల్ ఏవిధంగా చేయాలి దాని పైన అవగాహన కార్యక్రమం చేపట్టమని అడిషనల్ ఎస్పీ ఆర్మేడ్ రిజర్వ్‌కి సూచించారు. ముందుగానే ఫైర్ డిపార్ట్మెంట్, ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్‌తో డిప్లయ్మెంట్ ఏవిధంగా చేయాలి అని కూడా తెలియజేయమని చెప్పారు. మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడినప్పుడు తిరుమలలో ఏ రూట్ లో వెళ్లాలని క్లియర్ గా రూట్ ను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ వారితో కలిసి జాయింట్ ఎక్సర్‌సైజ్ చేయాలని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ లు కమాండ్ కంట్రోల్ రూమ్స్ ని కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తిరుమలలో ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్‌లో డ్రోన్‌తో కవర్ చేయాలన్నారు. ట్రాఫిక్ రద్దీ సమయాల్లో ఏ విధంగా అదుపు చేయాలని దాని పైన అవగాహన సదస్సు ఏర్పాటు చేయమని ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఆదేశించారు. తిరుపతి, తిరుమలలో కూడా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయవలసిందిగా అధికారులు ఆదేశించారు. అలిపిరి, శ్రీవారి మెట్లు మార్గాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడా బందోబస్త్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేపాక్షి, అఖిలాండం, నాలుగు మాడ వీధుల్లో, బందోబస్తును ఏర్పాటు చేసుకొవాలని చెప్పారు. రెండు ఘాట్ రోడ్లు కూడా తనిఖీ చేయాలని చెప్పి చెప్పారు. తిరుమలలో 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి సెక్టార్ సీసీ కెమెరాలు తోపాటు ఈసారి సోలార్ సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నమన్నారు. శ్రీనివాస మంగాపురం, శ్రీవారి మెట్టు ప్రాంతాలలో ఎవరికైనా మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడితే ఏ ఏ హాస్పిటల్ కు, వెళ్లాలని ముందుగా ప్లాన్ చేసుకోవాలని ఆదేశించారు. బందోబస్తు సిబ్బందికి వారు చేసే ఉద్యోగం పై అవగాహన కల్పించండి. ప్రతిరోజు కూడా అప్డేట్ చేయండి. రద్దీ సమయాలలో ప్రెజర్ పాయింట్లు ముందువైపు నుండి కాకుండా వెనకవైపు నుంచి కూడా రద్దీని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలి. రోప్ పార్టీలు కూడా సిద్ధంగా ఉంచండి. తిరుమలలో చిన్నపిల్లలు తప్పిపోకుండా ఉండుటకు పిల్లలు లకు ట్యాగ్లు తప్పకుండ ఏర్పాటు చేయాలన్నారు. టీటీడీ విజిలెన్స్ పోలీసువారితో కలిసి సమన్వయంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలో కె రవి మనోహర చారి, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం, శ్యాంసుందర్, విజయ శేఖర్, రామకృష్ణ చారి, సిఐ సాదిక్ ఆలీ, ఇంటలిజెన్స్ అధికారులు, టిటిడి విజిలెన్స్, అధికారులు పాల్గొన్నారు.

దసరా కానుకగా డీఏ మంజూరు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు, ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు నిర్మాణాత్మక సహకారం అందిస్తున్నారని.. గత ప్రభుత్వం ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసిందని, అయితే కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా డీఏ మంజూరు చేయాలని ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు, ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి పర్యటన నేపథ్యంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్నెల్లకోసారి ఇవ్వాల్సిన డీఏ మంజూరు కావడం లేదని.. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు న్యాయం జరిగేలా కొత్త కమిషనర్ నియామకం చేపట్టాలన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో తిరుపతి జిల్లా ఆడహాక్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కమిటీ ఛైర్మెన్ గా యస్ సురేష్ బాబు, కోకన్వీనర్ గా సి రఘు, కోశాధికారిగా వి.లలిత కుమార్, కమిటీ సభ్యులుగా చెంచు రత్నం, పణింద్ర, జనార్ధనయ్య, ఉపాధ్యక్షులుగా శవణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె. జగదీశ్వరరావు,,రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్,కడప జిల్లా అధ్యక్షులు బి శ్రీ నివాసులు, నెల్లూరు జిల్లా అధ్యక్షులు యం పెంచల్ రావు, జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ. తిరుపతి తాలూకా అధ్యక్షులు యస్ సురేష్ బాబు, కార్యదర్శి బాలాజీ మరియు జిల్లా నాయకులు అన్ని తాలూకా కార్వర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రహణం.. ఆలయాల ద్వారాలు మూత


తిరుమల



తిరుచానూరు

ప్రజాశక్తి - తిరుమల: చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వారాలను టీటీడీ మూసి వేసింది. సాంప్రదాయ బద్ధంగా మూసివేసినట్లు టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు విలేకరులకు తెలిపారు. రాత్రి 9.50 గంటల నుండి సోమవారం తెల్లవారుజామున 1.31 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుందన్నారు. సోమవారం ఉదయం శాస్త్రోక్తంగా శుద్ధి తదితర కార్యక్రమాలు పూర్తి చేసిన ఉదయం 3 గంటలకు మళ్లీ శ్రీవారి ఆలయ ద్వారాలు తెరిచి భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు. అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్మెంట్లో వేచి ఉన్న భక్తులందరికీ నిర్దేశిత సమయానికి అనుగుణంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం ఏర్పాట్లు దర్శనం కల్పించామన్నారు. అన్నప్రసాదం కాంప్లెక్స్, వకుళమాత, పిఏసి-2, వైకుంఠం వంటశాలలు మూసి వేసినట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్నప్రసాద విభాగం భక్తులకోసం 50 వేల పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేసిందన్నారు. అన్నప్రసాద వితరణ సోమవారం ఉదయం 8 గంటల నుండి పునఃప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఆలయ అర్చకులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, అన్నప్రసాదండిప్యూటీ ఈఓ రాజేంద్ర, విజిఓ సురేంద్ర, ఇతరులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి స్థానికాలయాలైన తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, శ్రీ కోదండరామస్వామివారి ఆలయం, శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, అప్పలాయిగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం, నారాయణ వనం, కార్వేటినగరం, ఒంటిమిట్ట, అమరావతి శ్రీ ఎస్వీ ఆలయం తదితర టిటిడి ఆలయాల తలుపులు మూసివేశారు. ఆదివారం రాత్రి 9.50 నుండి సోమవారం తెల్లవారు జామున 1.31 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీగా వస్తోంది.

గ్రహణాలకు భయపడని ముక్కంటి

శ్రీకాళహస్తి: చంద్రగ్రహణం వేళ దేశవ్యాప్తంగా ఉన్న హిందూ ధార్మిక ఆలయాలన్నీ మూతపడ్డాయి. అయితే దక్షిణ కాశీగా, రాహు కేతు సర్ప దోష నివారణ పూజల క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం మాత్రం మూతపడకపోవడం ఇక్కడ విశిష్టత. ఈనేపథ్యంలోనే ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలను నిర్వహించారు. రికార్డు స్థాయిలో రాహు- కేతు పూజలు చేసుకున్నారు. ముక్కంటీశుడు గ్రహణాదీసుడు కాబట్టే ఇక్కడ గ్రహణ సమయంలో సైతం ఆలయాన్ని మూత వేయకుండా పూజలు నిర్వహిస్తారు.

రామచంద్రపురం: మండలంలోని రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ కామాక్షి సమేత కోటి లింగేశ్వర స్వామి, శ్రీ భవాని జలకంఠేశ్వర స్వామి, అప్పలాయగుంట శ్రీ అభయ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాలను, ఆదివారం ఆలయ అర్చకులు మూసివేశారు. చంద్రగ్రహణ కాల అనంతరం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాలను పుణ్యాహవచనం చేసి తలుపులు తెరచి స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, అలంకరించి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డిఆర్ఓ నరసింహులు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీటీ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి తిరుపతి లోని పలు పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలను ఆదివారం డిఆర్ఓ నరసింహులు పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష కేంద్రాలను పరిశీలించి ఎటువంటి సమస్యలు లేకుండా మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఈ పరీక్షలు ఆఫ్‌లైన్, ఒయంఆర్ విధానంలో ఉదయం 10.00 నుండి 12.30 వరకు, మధ్యాహ్నం 3.00 నుండి సాయంత్రం 5.30 వరకు రెండు సెషన్లలో జరిగాయన్నారు . ఉదయం సెషన్ లో జరిగే పరీక్షలకు 10493 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 8670 అభ్యర్థులు హాజరయ్యారని, 1823 మంది పరీక్షలకు హాజరు కాలేదన్నారు. సాయంత్రం షసన్ లో ఏర్పాటుచేసిన 3 పరీక్షా కేంద్రాలలో 1690 మంది హాజరు కావలసి ఉండగా, 1335 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 358 మంది హాజరు కాలేదన్నారు. ఈ పరీక్షలు పకడ్బందీగా ప్రశాంతంగా జరిగాయన్నారు .పలు పరీక్షా కేంద్రాలలో కేంద్రాలలో డిఆర్ఓ నరసింహులు పరిశీలించారు.

గంగమ్మ ఆలయానికి భూమి కొనుగోలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయానికి భూమిని దాతల సాయంతో కొనుగోలు చేశారు. ఆలయంలోని వినాయకుని గుడిని ఆనుకుని ఉన్న ముప్పయ్ ఒకటిన్నర అంకణాల ప్రైవేట్ భూమిని యాభై లక్షలకు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్‌ను గంగమ్మ తల్లి వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఈఓ జయకుమార్‌లు ఉంచి పూజలు నిర్వహించారు. మొత్తం యాభై లక్షలకు గాను 25 లక్షల రూపాయలను అడ్వాన్స్‌గా ఇచ్చారు. అడ్వాన్స్ మొత్తాన్ని రాయలసీమ విద్యాసంస్థల అధినేత లావణ్య ఆనంద్ రెడ్డి, కవిత, మనోహర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు తలా ఐదు లక్షల వంతున అందించారు. మిగిలిన 25 లక్షలను ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చారని త్వరలోనే నగదు మొత్తం చెల్లిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆలయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ భూమిని కొన్నట్లు ఆయన చెప్పారు. ఈ స్థలం కొనుగోలులో కీలకంగా వ్యవహరించిన ఈఓ జయకుమార్‌ను అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మరో ముప్పయ్ అంకణాల నివాస స్థలాన్ని ఆలయానికి ఇచ్చి సహకరించాలని స్థల యజమాన్యాన్ని ఆయన కోరారు. గంగమ్మ తల్లి ఆశీశ్శులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక టిటిడి నిధులు మూడు కోట్ల తొంభై లక్షల రూపాయలు ఆలయ అభివృద్ధికి వెచ్చించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మబ్బుదేవ నారాయణ రెడ్డి, పులుగోరు మురళీ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, చింతా భరణీ యాదవ్, దొడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, రాజా రెడ్డి, గంజి సుధాకర్ రెడ్డి, వెంకటేష్, పగడాల మురళీ, ఆముదాల వెంకటేష్, ఆళ్వార్ మురళీ, కోదండ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉదయ్ ముదిరాజ్, జానకి రామ్ రెడ్డి, బుజ్జిబాబు, రుద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగంలో క్రెడాయ్ పాత్ర అమోఘం

- టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి
- ఘనంగా ముగిసిన ఎక్స్‌పో



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: క్రెడాయ్ భవన నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషించడం అమోఘమని టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రాపర్టీ షో మూడో రోజు ముగింపు సందర్భంగా మీరు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మూడు రోజులపాటు జరిగిన ఈ షోకు తిరుపతి నెల్లూరు కడప అనంతపురంతో జిల్లాలతో పాటు తమిళనాడు కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో వినియోగదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో ఆధునిక టెక్నాలజీతో కూడిన ఉత్పత్తులు, వివిధ గృహ సుందరీకరణ వస్తువులు, ప్లాట్లు, అపార్ట్మెంట్, రుణ సదుపాయాలు, ఆధునాతన కార్లు వంటి వాటిని ఒకే వేదికపైకి తెచ్చి సుమారు 60 స్టాల్స్ తో ప్రజల కలలు సాకారం చేసే దిశగా కృషి చేసిన క్రెడాయ్ ప్రతినిధులను వారు అభినందించారు. అనంతరం క్రెడాయ్ ఛైర్మన్ గోపినాథ్ అధ్యక్షుడు రాంప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు తాము ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆదరించిన విజయవంతం చేసిన ప్రజలకు, ఇందుకు సహకరించిన వివిధ కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతులు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో భవిషత్తులో మరిన్ని ప్రదర్శనల ద్వారా ప్రజల ఆశయాల సాధనకు తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ కార్యదర్శి నరసింహులు, ఉపాధ్యక్షుడు , రాజేష్ బాబు, కోశాధికారి హరికృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో

యాజమాన్యం వైఫల్యం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్, సిటీ: టీటీడీ పర్మినెంట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం తీవ్రమైన వైఫల్యాన్ని ప్రదర్శిస్తున్నదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆరోపించారు. టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సిఐటియు అనుబంధం) 40వ వార్షికోత్సవ సభ ఆదివారం నాడు వేమన విజ్ఞాన కేంద్రంలోని పలవలి రామకృష్ణారెడ్డి హాలులో వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ వార్షికోత్సవ సభను సిఐటియు జిల్లా కోశాధికారి కేఎన్ఎన్ ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి కందారపు మురళి ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత టిటిడి లో సమస్యల పరిష్కారానికి తీవ్రమైన జాప్యం జరుగుతున్నదని, అధికారులు పాలకమండలి మధ్య సమన్వయ లోపం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాలేదని అభివృద్ధి పనులు చేపట్టడంలోనూ, అప్రూవల్స్ తెప్పించడంలోనూ, మిగిలిపోయిన ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు స్థలాలు ఇప్పించడంలోనూ ఆలస్యాన్ని పరిష్కరించాలని కోరారు. గత నాలుగున్నర ఏళ్లుగా పదోన్నతులు లేవని వందల మంది పదవీ విరమణ పొందుతున్నారని, సమస్య పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపడం లేదని విమర్శించారు. టిటిడిలో కార్పొరేట్ హాస్పిటల్స్‌లో సైతం వైద్యం చేయించుకోవటానికి అనుమతిని, పిలిగ్రామ్ అలవెన్స్ 2500 నుంచి 5000 రూపాయలకు పెంచాలని, హిల్ అలవెన్సు 400 నుంచి 800 రూపాయలకు పెంచాలని కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని, సొసైటీ కార్పొరేషన్, కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వేలాది మంది కార్మికులను, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, మినిమం టైమ్ స్కేలు ఇవ్వాలని, తక్షణం రిక్రూట్ మెంట్ చేపట్టాలని పలు తీర్మానాలను ఉద్యోగులు సభలో ఆమోదించారు. గత నలభై ఏళ్లలో టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలు, ఫలితాలు గురించి యూనియన్ గౌరవాధ్యక్షులు జి వెంకటేశం సభకు వివరించారు. పోరాట వారసత్వం ఉన్న స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాజీలేని పోరాటాలు చేపడుతుందని ప్రకటించారు. టిటిడి నేత మల్లారపు నాగార్జున మాట్లాడుతూ టిటిడి లో ఎస్ డబ్ల్యు ఎఫ్ ఆధ్వర్యంలో వేలాదిమంది కార్మికులను 1991 నాటికే పర్మినెంట్ చేయించడానికి పెద్ద ఎత్తున పోరాటాలు చేపట్టి విజయం సాధించిందని గుర్తు చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ కార్యదర్శి నివేదికను సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ నేతలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించారు. ఈ నిర్ణయాలను టిటిడి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని నేతలు సభ్యులకు తెలిపారు.

నారాయణాద్రిలో ఉపాధ్యాయులకు సత్కారం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీచర్స్ డే సందర్భంగా ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల కోసం "గురుదేవోభవ" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక ప్రివిలేజ్ కార్డ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఈఓ కె.వి.ఎన్. కుమార్, ప్రత్యేక అతిథిగా డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి (రాయలసీమ జోన్ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్), రవీంద్ర రెడ్డి (రవీంద్ర భారతీ స్కూల్స్) హాజరయ్యారు. డిఈఓ కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థ బలపడాలంటే ఉపాధ్యాయుల శ్రేయస్సు అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సిఓఓ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు, వారి ఆరోగ్యాన్ని కాపాడటం మా బాధ్యత అని తెలిపారు. సిఈఓ డాక్టర్ హరి కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, నిబద్ధతను గుర్తించడానికి హాస్పిటల్ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఎండి డాక్టర్ సునందకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యతో సమాజం మారుతుంది, సమాజం మార్పుకు దోహదపడే గురువులను గౌరవించడం గొప్ప పున్యమని అన్నారు. ఈ సందర్భంగా ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు 150 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, ప్రథిమ, వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



ప్రజాశక్తి - చంద్రగిరి : తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు పంచాయతీ పరిధి, శిల్పారామంలో చంద్రగిరి నియోజకవర్గ స్థాయిలో ఉన్న ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్యే పులివర్తి నాని, మున్సిపల్ కమిషనర్ మౌర్య, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పశుపులేటి హరిప్రసాద్, నరసింహ యాదవ్, టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, ఆర్.సి మునికృష్ణ, జిల్లా విద్యా శాఖ అధికారి కె.వి ఎన్ కుమార్, తిరుపతి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో పలువురికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సిఫార్సుతో వచ్చిన సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. గొల్లపల్లికి చెందిన గంగాధరానికి రూ.40,000 పుత్తూరు మున్సిపాలిటీ ఆర్కేసీ కాలనీ చెందిన రాజేంద్రకు రూ.92,737, బెస్త వీధికి చెందిన కనియమ్మకు రూ.30028, కళ్యాణపురానికి చెందిన కసుమకు రూ 45.350, సత్యనారాయణపురం కాలనీకి చెందిన ప్రసాద్‌కు రూ. 61,572, పి ఆర్ కండ్రిగకు చెందిన మహేశ్వరికి రూ. 42746, పన్నూరుకు చెందిన పావనికి రూ. 22,302, ఆలపాకంకు చెందిన మునిరత్నమ్మకు రూ. 86957, కాళికాపురానికి చెందిన వినయ్ కుమార్‌కు రూ. 75145, నగరి రూరల్ మండలం, ఆదివికొత్తూరుకు చెందిన నాగరాజునకు రూ. 43184, నింద్ర మండలం, అగరం గ్రామానికి చెందిన శంకరయ్యకు రూ. 23,588, మున రాజేంద్రకు రూ. 61,572 రూపాయల చెక్కులు పంపిణీ చేశారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి


ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టీడీపీ పాలనలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు, బనిగి సాహెబ్ పేట, బీసీ హాస్టల్ భవనంలో ఆదివారం ఆయన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వసతులతో హాస్టల్ భవనం ఉండటం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, చెంచురామయ్య, ధనంజయ రెడ్డి, మీరా రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు జనార్దన్, రహీం, ఇక్బాల్, అల్లి బాషా, నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రౌడీ షీటర్లు నేరాలను విడిచిపెట్టి సత్ప్రవర్తనతో నడవాలని రాబోయే పండుగ రోజుల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆంజనేయ స్వామి వారి జెండా ఉత్సవంలో డీజేలకు అనుమతి లేదని గూడూరు డిఎస్పీ గీతా కుమారి తెలిపారు. గూడూరు పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం నిర్వహించిన రౌడీ షీటర్ల కౌన్సిలింగ్ కార్యక్రమంలో డిఎస్పీ గీతా కుమారి పాల్గొన్నారు. ఈ సమావేశంలో సిఐ శేఖర్ బాబు, ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ



ప్రజాశక్తి-ఏర్పేడు: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనల మేరకు మండలంలో వైసీపీ నాయకులు మునలిపేడు పంచాయతీ బత్తినయ్య కాలనీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ.. రీకల్ చంద్రబాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏర్పేడు మండల ఇంచార్జ్ గెన్నెటి కిషోర్ రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సురవరం సుధాకర్ రెడ్డి బహుముఖ ప్రజ్ఞశాలి అని, ఆయన జీవితంలో ఎన్నడూ నిత్య విద్యార్థి గానే ఉండేవారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి కొనియాడారు. మాజీ ఎంపీ, సిపిఐ సీనియర్ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను ఆదివారం తిరుపతిలోని గంధమనేని శివయ్య భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బి తులసేంద్ర, సీనియర్ అడ్వకేట్ రాఘవ శర్మ, సీనియర్ నాయకులు దేవేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, ఎల్ ఎం కండ్రిగ కాలనీలో తాగు నీటి బోర్ వేయించి సమస్య తీర్చడమే కాకుండా కాలనీకి సిమెంట్ రోడ్డు మంజూరు చేయించి నందుకు, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ సమస్యకైనా పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

కుంభాభిషేకంలో రోజా



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నింద్ర మండలం దళితవాడలో నూతనంగా నిర్మించిన శ్రీ మేల్ మరువత్తూర్ ఆదిపరాశక్తి అమ్మవారి ఆలయంలో ఆదివారం నిర్వహించిన మహా కుంభాభిషేక ఉత్సవంలో మాజీ మంత్రి ఆర్ కే రోజా పాల్గొన్నారు. ఆలయ పూజారులు పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఆమె వెంట స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మకు తెగులు.. రైతుకు దిగులు

దిగుబడీ లేదు.. ధరా లేదు




ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దేశ వ్యాప్తంగా గూడూరు నిమ్మకాయకి మంచి గిరాకీ ఉంది. మూడు నెలల క్రితం నిమ్మ రైతులకు దిగుబడి ఆశాజనకంగా ఉంది. నిమ్మ తోటలకు తెగుళ్లు సోకుతుండటంతో ఇప్పుడు పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. నిమ్మ కాయలకి తెల్ల మంగు, గాడిద మచ్చలు సోకడంతో దిగుబడి తగ్గి రైతులు కాపును తోటల్లోనే వదిలేస్తున్నారు. దిగుబడి తగ్గి, కాయలో నాణ్యత లోపించడంతో క్రయ, విక్రయాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. సకాలంలో వర్షాలు కూడా పడకపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. వర్షాలు లేని కారణంగా తెగుళ్లు సోకి నిమ్మ రైతులు నష్ట పోతున్నారు. గతంలో లావులు కె.జీ 60 నుండి 70 రూపాయలు ధర పలికింది, ఇప్పుడు 30 నుండి 40 రూపాయలు పలుకుతోంది. గతంలో సన్నాలు కె. జి 30 నుండి 40, ఇప్పుడు 15 నుండి 25 రూపాయలు పలుకుతోంది. అదేవిధంగా బీజాపూర్, తమినాడు, మహా రాష్ట్రలో ఎక్కువ దిగుబడి రావడంతో ఆ ప్రభావం గూడూరు నిమ్మకాయలకు మీద పడింది.

తెగుళ్లతో నష్ట పోయాం..

నిమ్మ చెట్లకు తెల్ల మంగు, గాడిద మచ్చలు సోకడంతో తీవ్రంగా నష్ట పోయాం. ఇప్పటికి వరకు మూడు లక్షల రూపాయలను పురుగు మందులకు ఖర్చు చేశాను. అయినప్పటికీ ఫలితం శూన్యం. పెట్టుబడి కూడా రావడం లేదు, కూలి ఖర్చులు కూడా రావట్లేదు. పంట అలాగే చెట్లకు వదిలేసే పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- కనుమూరు సురేష్ రెడ్డి, రైతు, చెన్నూరు

19 నుండి ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: షాపింగ్ పరంగా సౌలభ్యంకు సంబంధించిన అపూర్వమైన వేడుకలో భాగంగా వాణిజ్య వేదిక అయిన ఇన్‌స్టామార్ట్, తమ ప్రారంభ వార్షిక మెగా సేల్, ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025' ను ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మహేష్ తెలిపారు. ఈ అమ్మకం, కొనుగోలుదారులకు వేగవంతమైన డెలివరీతో పాటుగా ఉత్తేజకరమైన ఆఫర్‌లను సైతం అందిస్తుంది, ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా షాపింగ్ అనుభవాలను సృష్టిస్తోంది. ఈ సేల్ సెప్టెంబర్ 19 నుండి28 వరకు ఇన్‌స్టామార్ట్ యాప్, స్విగ్గీ యాప్ రెండింటిలోనూ అందుబాటులో ఉండనుంది. ఈ సేల్ కాలంలో కస్టమర్లు 50-90% తగ్గింపుతో భారీ రాయితీలను ఆశించవచ్చు, ఎలక్ట్రానిక్స్, కిచెన్ , డైనింగ్, బ్యూటీ , పర్సనల్ కేర్, బొమ్మలు, మరిన్ని విభాగాలలో గణనీయమైన తగ్గింపులను సైతం పొందవచ్చన్నారు. ఇవన్నీ కేవలం 10 నిమిషాల్లో డెలివరీ చేయబడతాయి. 50,000 కంటే ఎక్కువ ఉత్పత్తులతో, ఈ సీజన్ అతిపెద్ద ఆఫర్‌లకు త్వరిత వాణిజ్యం వేగం, సౌలభ్యాన్ని తీసుకురావడం ద్వారా ఇన్‌స్టామార్ట్ పండుగ షాపింగ్‌ను పునరావిష్కరిస్తోందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత , లాజిస్టిక్స్ ఆవిష్కరణల మద్దతుతో, ఈ అమ్మకం ప్రతి డీల్‌ను పరిశ్రమ-ప్రముఖ వేగం, విశ్వసనీయతతో ఇన్‌స్టామార్ట్ కస్టమర్లు ఆశించినట్లు లభిస్తుందని తెలిపారు. పండుగ-స్థాయి ఆఫర్‌ల కంటే మిన్నగా ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ అందరికీ సౌలభ్యం, ఎంపిక విలువను తక్షణమే అందుబాటులో ఉంచుతుందని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల రెండవ జిల్లా మహాసభ




ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని వేదనపర్తి సుందర్ రామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఉదయం మధ్యాహ్న భోజనం కార్మికుల రెండో జిల్లా మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వ విద్యా రంగాల్లో అన్నిట్లో అతి ముఖ్యమైనది విద్యార్థుల ఆకలి తీర్చే మిడ్ డే మీల్స్ విభాగమన్నారు. అంతటి ప్రాముఖ్యత గల మిడ్ డే మీల్స్ కార్మికులను ఎన్ని ప్రభుత్వాలు మారిన వారి కనీస అవసరాలు తీర్చే ఆలోచన చేయకపోవడం, కనీసం వాళ్ళను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అరకొర జీతాలు ఇస్తున్నా, విద్యార్థుల కోసం అది ఒక బాధ్యతలా భావించి పనిచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. వారిపై రాజకీయ వేధింపులు అధికంగా ఉన్నాయని, వీటిపై ప్రభుత్వం పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మునిరాజా, శివకవి ముకుందలు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటాలు చేసినప్పుడే సమస్యలు తొలగిపోతాయన్నారు. కార్మికులంతా ఒక్కటై పోరాటాలు సాగించి సమస్యలను తరిమికొట్టాలని, కార్మికుల ఐక్యత కోసమే ఇలాంటి మహాసభలు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామని తెలిపారు. అందరూ ఒక్కటై సమస్యలపై పోరాడేందుకు కమిటీలను తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ మహాసభ సందర్భంగా మిడ్ డే మీల్స్ కార్మికుల నూతన కమిటీని 13 మందితో ఏర్పాటు చేశారు. కమిటీ కార్యదర్శిగా కే.విజయమ్మ, అధ్యక్షులుగా ఎస్.కె.పజీరియా, ట్రెజరరుగా కే.వాణిమ్మ, ఉపాధ్యక్షులుగా జయమ్మ, కళ్యాణి సహాయ కార్యదర్శులుగా సుగుణమ్మ, లక్ష్మి, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, ప్రమీలమ్మ, భారతి, నిర్మలమ్మ, విమాలమ్మ, ముఖ్య అతిథులుగా ప్రాజెక్ట్ కార్యదర్శి నెలవల శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని గరిడీ వీధుకి చెందిన కిషోర్ బాబు అనే వ్యక్తికి బలిజ సేవ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం10,000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు.బలిజ సేవ ఫౌండేషన్ ద్వారా నాయుడుపేట బలిజ సంగం ప్రెసిడెంట్ పగడాల.శివ ప్రదీప్ ఆధ్వర్యంలో లో బలిజ సంగం సహాయ కార్యదర్శి హంస.పృథ్వీ చంద్ సహకారం తో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ అభ్యర్థన మేరకు నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని గరిడీ వీధిలో నివాసం ఉంటున్న పెరిచర్ల.కిషోర్ బాబు గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాడు ఆయనకు ఇద్దరు చదువుకుంటున్న కుమారులు భార్య ఉన్నారు. ఆయన గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు డయాలసిస్ చేయించుకోవాల్సిన అవసరం ఉన్నా ఆర్థిక స్తోమత లేక ఆయన ఆయన కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బలిజి సేవ ఫౌండేషన్ వారు ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం 10,000 (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా బలిజ సంఘం సహాయ కార్యదర్శి హంస. పృథ్వీ చంద్ మాట్లాడుతూ మా ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది అభాగ్యులకు ఎవరి వద్ద చందాలు గానీ ఎలాంటి సహాయ సహకారాలు గాని తీసుకోకుండా. మా ఫౌండేషన్ సభ్యులు మాత్రమే ఇలా ఇబ్బందుల్లో ఉన్న వారికి సహాయపడుతున్నామని.మేము చేస్తున్న ఈ సేవ మాకు ఎంతో సంతృప్తినిస్తుందని ఇలాంటి వారు ఎంతో మందికి సహాయ సహాయ పడగలుగుతున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు.

శెట్టిపల్లి రైతులకు న్యాయం చేయాలి


ఎమ్మెల్యే ఆరణికి వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శెట్టిపల్లి భూ సమస్యను సీఎం, డిప్యూటీ సీఎంలు పరిష్కరించడం సంతోషంగా ఉందని చెబుతూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను రైతులు ఆదివారం ఉదయం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మొదటి నుంచి టీడీపీ, జనసేన పార్టీలు శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి ఎంతో కృషి చేశాయని రైతుల తరుపున బాల మురళీకృష్ణ, రామకృష్ణాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రైతుల అనుభవంలో ఉండి పెండింగ్ లో ఉన్న 30 ఎకరాలకు ప్రొసీడింగ్స్ ఇప్పించాలని, శెట్టిపల్లిలో ల్యాండ్ పూలింగ్ కు పోను మిగిలిన భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యేని వారు కోరారు. రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీనివాసులు వారికి తెలిపారు.

సచ్చిదానందం శతజయంతి స్మారక సభ


మేడసాని మోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో "విద్వాన్ సింగరాజు సచ్చిదానందం శతజయంతి స్మారక సభ" విజయవంతంగా నిర్వహించారు. విద్య, సాహిత్యం, సమాజానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావునికి ఇది నిజమైన నివాళి అని ముఖ్య అతిథి డా. మేడసాని మోహన్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు పోరును విజయవంతం చేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన వైసీపీ చేపడుతున్న రైతు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం రైతు పోరు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎరువుల పక్కదారి, పంటల గిట్టుబాటు ధరపై రైతులు చంద్రబాబును ప్రశ్నించాలన్నారు. వైసీపీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రైతు పోరు సాగుతుందని చెప్పారు. చెవిరెడ్డి మధుసూధన్ రెడ్డి, ఉత్తరాజి శరవణ, ముత్తు, సిరాజ్, కంఠా ఉదయ్, ఫజల్, మధు రెడ్డి, రామచంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రైతన్నలకు బాసటగా ఈనెల 9 వ తేదీ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రైతు పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ని గూడూరు, సనత్ నగర్, నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో వైసిపి నాయకులతో కలిసి ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ మెరిగ మురళీధర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో రైతుల సంక్షేమ కార్యక్రమాలు చక్కగా అమలయ్యాయని తెలిపారు. కానీ ప్రస్తుతం విత్తనాలు దొరక్క, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక.. పంటలు ఎగుమతి లేకపోవడంతో రైతులు నిరాశ నిస్పృహలతో ఉన్నారన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రైతులకు సంఘీభావంగా.. రైతు సమస్యలను ప్రభుత్వానికి వివరిస్తూ ఈ నెల 9వ తేదీ వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించి.. రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు వేగవంతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గతంలో తాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పటి ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు సహకారంతో పనులు ప్రారంభించినప్పటికీ, పూర్తిగా పూర్తికాక వదిలివేయడం, వర్షాల కారణంగా ట్యాంక్ తెగిపోవడం వంటి కారణాలతో పనులు స్థంభించాయి. ప్రస్తుతం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చొరవతో తెలుగు గంగ నుండి తాగు నీటిని అందించే ప్రణాళికను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం రూ.6 కోట్ల 53 లక్షల నిధులను మంజూరవడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

సిఐటియు జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : కార్మిక వర్గ సమస్యలను పరిష్కార వేదికగా, సిఐటియు రెండవ జిల్లా మహాసభలు పుత్తూరులో అక్టోబర్ 13,14 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ సభలను జయప్రదం చేయాలని తిరుపతి రూరల్ మండలం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం అగ్రికల్చర్ కళాశాలలో సమావేశ నిర్వహించారు. ఈ సభలకు ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశం రూరల్ కార్యదర్శి నాగ వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు తీసుకొచ్చారని విమర్శించారు.ఈ సమావేశంలో సిఐటియు నాయకులు రాము ప్రభాకర్ రెడ్డి ఈశ్వర్ రెడ్డి కిరణ్ గురు తదితర నాయకులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఘనంగా గురుపూజోత్సవం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి నగరపాలక కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మెన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవసంఘం చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్. సి.మునికృష్ణ, రాష్ట్ర హస్తకళ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరి బాల్యం ఉపాధ్యాయుని విద్యా విలువలతో కూడిన జీవితం ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ స్థాయిలో సుమారు పదహైదు వందలకు పైగా ఉపాధ్యాయిని , ఉపాధ్యాయులను సత్కారించారు.

సీఐ వెంకటరమణకు సన్మానం



ప్రజాశక్తి -కోట : కోట మండలం, స్థానిక షాదీ మంజిల్‌లో గతంలో కోట ఎస్సైగా పనిచేసి ప్రస్తుతం సీఐగా పదోన్నతి పొందిన తురకా వెంకటరమణను గూడూరు డివిజన్ స్థాయి లోని పలువురు దళిత నాయకులు, వెంకటరమణ అభిమానులు ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు సీఐ నీతి, నిజాయితీలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉయ్యాల రామకృష్ణ, బీఎస్పీ నాయకులు మీజూరు మాధవ్, తిరుమూరు కృష్ణయ్య, కర్లపూడి రాంబాబు, వెంకట రమణయ్య, ఎంబేటి మస్తాన్, కర్లపూడి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై బోధనా సిబ్బందికి శిక్షణ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీఎం ఉష సహకారంతో జీవన నైపుణ్యాలపై బోధనా సిబ్బందికి మూడు రోజుల సదస్సు ఆదివారం ధృతి హాల్లో ప్రారంభించారు. ఈ శిక్షణకు 38 మంది ఎస్‌పిఎంవివి బోధన సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ చాలామంది విద్యార్థులు జీవన నైపుణ్యాలను అలవర్చుకోవడంలో వెనకబడి ఉన్నారన్నారు. అందువలన నిమ్హాన్స్ కొలాబరేషన్తో లైఫ్ స్కిల్స్ ఎడ్యుకేషన్ రాష్ట్రమంతా అందించడానికి మహిళా యూనివర్సిటీని ఈ విషయంలో నోడల్ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జాన్ సుష్మా డాక్టర్ భార్గవి ఆర్గనైజింగ్ సెక్రటరీస్ గా వ్యవహరించారు.

క్రైం న్యూస్

స్కూటర్, ఆటో ఢీ.. తండ్రి కొడుకులకు గాయాలు



ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని పారకాల్వ సమీపంలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు స్కూటర్ను పాల ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కరకంబాడికి చెందిన తండ్రి, కొడుకులు వెంకటేష్, సంతోష్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. పారకాల్వ కోళ్ల ఫామ్స్ వద్ద, కోడి తీసుకుని ద్విచక్ర వాహనంలో తిరుపతికి బ్రాహ్మణ పట్టు మార్గం వైపు వెళుతుండగా బ్రాహ్మణ పట్టునుండి పారకాల్వ వైపు వస్తున్న పాల ఆటో రాంగ్ రూట్లో వేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టింది. దీంతో తండ్రి, కొడుకులు ఇద్దరూ రోడ్డుపై పడడంతో తలకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి, తిరుపతి రుయా హాస్పిటల్‌కు తరలించారు. ఆర్ సి పురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు అదృశ్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న షేక్ రఫీ(28) ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. రఫీ తండ్రి హుస్సేన్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సిఐ నాగార్జున రెడ్డి తెలిపారు. రఫీ పాత వాహనాలు కొని తిరిగి వాటిని విక్రయిస్తూ ఉంటాడనీ, ఈ క్రమంలో ఈనెల 5వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడని తెలిపారు. రఫీ ఆచూకీ కోసం అన్ని ప్రయత్నాలు చేసి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారని సిఐ అన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నెం: 9440900008కు సమాచారం అందించాలని కోరారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆంధ్ర చెస్ అసోసియేషన్, తిరుపతి చెస్ అసోసియేషన్ సహకారంతో, రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గూడూరు, నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో 7వ ఏపి. స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి మొత్తం 194 క్రీడాకారులు పాల్గొన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్ షేక్ షరీఫా, చీఫ్ అర్బీటర్‌గా బాలాజీ చౌదరి వ్యవహరించారు. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిలుగా గూడూరు డీఎస్పీ గీతకుమారి పాల్గొని, విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రీడ స్ఫూర్తిని పెంపొందించు కోవాలన్నారు.

జగన్ మాటలు.. అసత్యాలు : టీడీపీ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ సీఎం జగన్ మాటలన్నీ అబద్దాలేనని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు ఆదివారం మీడియా ముఖంగా విమర్శించారు. 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తానని ప్రగల్భాలు పలికి, ఇప్పుడు చంద్రబాబుపై ప్రైవేట్ పరం చేసేస్తున్నాడంటూ గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో జీఓ నెంబర్ 133, 107, 108 తెచ్చి ప్రభుత్వ మెడికల్ కాలేజీల పేరుతో, పేద విద్యార్థుల సీట్లు అమ్ముకుంది వాస్తవం కాదా ? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో మ్యానేజ్మెంట్ కోటా తెచ్చి, సీట్లు అమ్ముకోలేదా ? "సెల్ఫ్ సస్టైనబుల్ ఫైనాన్సియల్" మోడల్ తెచ్చింది వాస్తవం కాదా ? అంటూ నిలదీశారు. చంద్రబాబును విమర్శించే హక్కు జగన్ లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.


ఇంటి పన్నులు వేసి.. సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, వికృతమాల పంచాయితీ పరిధిలోని ఇండ్లకు ఇంటి పన్ను వేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి డిమాండ్ చేశారు. వికృతమాల పంచాయితీ పరిధిలో గల ఇళ్ల లబ్ధిదారుల సమావేశం ఆదివారం ప్రభుత్వ గృహల వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వికృతమాల, జగనన్న కాలనీలోని ఇళ్లకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో నారాయణ, గోపాల్ రెడ్డి, ఎన్ నారాయణ, పుష్ప రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో విశాఖ అడిషనల్ జడ్జి

ప్రజాశక్తి -ఏర్పేడు : గుడిమల్లం పరుశురామేశ్వర స్వామివారిని విశాఖపట్నం అడిషనల్ జడ్జ్ సి.కె గాయత్రీ దేవి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేసి వేద పండితులచే ఆశీర్వచనం చేయించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి కె. రామచంద్ర రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పోలీసులకు వినాయక నిమజ్జన కమిటీ సన్మానం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వరసిద్ధి వినాయక చవితి సందర్భంగా నిమజ్జన కార్యక్రమంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా భక్తులకుఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్న తిరుపతి అలిపిరి, ఈస్ట్ పోలీస్ స్టేషన్ల సిఐలు రామ్ కిషోర్, శ్రీనివాసులును సుందరయ్య నగర్ నాలుగో వీధి శ్రీ వరసిద్ధి వినాయక చవితి యూత్ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి మాట్లాడుతూ వినాయక ఉత్సవాల నిర్వహణకు పోలీసుల పర్యవేక్షణ అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంకార్యక్రమంలో సోము, పూలపవన్, డిల్లీ, టోని, ముభారక్, రోహిత్, యోగి,ఉదయ్ కిరణ్,నవదీప్ తదితరులు పాల్గొన్నారు.